ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 08-08-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- గంజాయి స్మగ్లర్ల ఆస్తుల జప్తునకు చర్యలు తీసుకుంటున్నామని ఈగల్ ఐజీ రవికృష్ణ వెల్లడించారు.

- హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు రికార్డు స్థాయిలో కేవలం 100 రోజుల్లోనే పూర్తి చేశామని మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు.

- రాష్ట్రంలో టిడ్కో గృహాలను లబ్ధిదారులకు డిసెంబర్ నాటికి అందిస్తామని మంత్రి పొంగూరు నారాయణ వెల్లడించారు.

- ఆహార తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటించని హోటల్స్, ఆహార విక్రయ సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.

- ఉత్తర కర్ణాటకలో సగటు సముద్ర మట్టానికి 5.8 కి.మీ ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతుందని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది.

==================

రాష్ట్రంలో టిడ్కో గృహాలను లబ్ధిదారులకు డిసెంబర్ నాటికి అందిస్తామని పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పొంగూరు నారాయణ వెల్లడించారు. ఈరోజు ఆయన నెల్లూరు భగత్ సింగ్ కాలనీలో పర్యటించి పట్టాల పంపిణీ కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భగత్ సింగ్ కాలనీలో పేదలకు రేపు దృశ్య మాధ్యమ విధానంలో ఇంటి పట్టాలను అందిస్తారని తెలిపారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తున్నామని, ఈ నెల 15వ తేదీ నుండి మహిళలకు స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకం ప్రారంభిస్తున్నామని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధిని సమాంతరంగా తీసుకెళ్తున్నామని మంత్రి నారాయణ పేర్కొంటూ..

(వాయిస్ బైట్...28 సెకన్లు)

==================

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పరిధిలోని అన్ని న్యాయ స్థానాల్లో సెప్టెంబర్ 13వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు ఈరోజు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అదాలత్ లో న్యాయ స్థానాల్లో అపరిష్కృతంగా ఉన్న కేసులు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులను పరిష్కరించుకోవచ్చని, కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు విశాఖపట్నం జిల్లా న్యాయ సేవాధికార సంస్థను లేదా 0891 - 2560414, 2575046 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

==================

హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు రికార్డు స్థాయిలో కేవలం 100 రోజుల్లోనే పూర్తి చేశామని రాష్ట్ర ఆర్థిక, శాసనసభ వ్యవహారాల శాఖా మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గంలో రాగులపాడు పంప్ హౌస్ ను ఆయన ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మంత్రి మాట్లాడుతూ... రాగులపాడు లిఫ్ట్ ఇరిగేషన్ వద్ద ప్రతిరోజు 8 నుంచి 10 పంపుల వరకు పనిచేస్తున్నాయని చెప్పారు. మొదటి సంవత్సరంలోనే  కేవలం 100 రోజుల పనుల లక్ష్యంతో ఉరవకొండ ప్రాంతంలోనే హంద్రీనీవా కాలువ నీటి సామర్థ్యాన్ని రెట్టింపు చేసుకోగలిగామని తెలిపారు. జిల్లాలో ఉన్న ప్రతి రిజర్వాయర్ కు, అవకాశం ఉన్న ప్రతి చెరువుకు నీరందించే విధంగా హంద్రీనీవాను సిద్దం చేస్తున్నామని మంత్రి తెలియజేశారు.

===================

గంజాయి స్మగ్లర్ల ఆస్తుల జప్తునకు చర్యలు తీసుకుంటున్నామని ఈగల్ ఐజీ రవికృష్ణ వెల్లడించారు. ఈరోజు విశాఖ కేంద్ర కారాగారాన్ని సందర్శించిన ఆయన గంజాయి నిందితులతో మాట్లాడి, గంజాయి రవాణాకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఐజీ రవికృష్ణ మాట్లాడుతూ... అల్లూరి సీతారామరాజు జిల్లాలో గంజాయి సాగును పూర్తిగా నియంత్రించామని వెల్లడించారు. ప్రస్తుతం గంజాయి అంతా ఒడిశా నుంచే వస్తోందని, ఆ రాష్ట్రం నుంచి వచ్చే అన్ని రైళ్లను తనిఖీ చేస్తున్నామని ఆయన తెలియజేస్తూ...

(వాయిస్ బైట్...30 సెకన్లు)

===================

తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో ఈరోజు వరలక్ష్మీవ్రతం వైభవంగా జరిగింది. ఆస్థానమండపంలో వేదపండితుల ఆధ్వర్యంలో వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించారు. వ్రతంలో పాల్గొన్న భక్తులకు పసుపు, కుంకుమను తిరుమల తిరుపతి దేవస్థానం ఉచితంగా అందజేసింది. శ్రీకాళహస్తి దేవస్థానంలోని బ్రహ్మగుడి వద్ద వేద సామూహిక వరలక్ష్మి వ్రతంలో మహిళా భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే.. శ్రీశైలం దేవస్థానం ఆధ్వర్యంలో ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతం ఘనంగా నిర్వహించారు. ఆలయ చంద్రావతి కల్యాణ మండపంలో జరిపిన ఈ వ్రతంలో సుమారు 16 వందల మంది మహిళా భక్తులు పాల్గొన్నారు. వ్రతంలో పాల్గొన్న మహిళలకు అమ్మవారి శేషవస్త్రం, పూలు, గాజులు, ప్రసాదం అందజేసి స్వామి, అమ్మవార్ల దర్శనం కల్పించారు.

===================

విరామం

===================

ఆహార తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటించని హోటల్స్, ఆహార విక్రయ  సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ ఈరోజు ఒక పత్రికా ప్రకటనలో స్పష్టం చేశారు. ఇటీవల విశాఖపట్నంలో నిర్వహించిన తనిఖీలలో 51 రెస్టారెంట్లలో 44 రెస్టారెంట్లు నాణ్యతా ప్రమాణాలకు విరుద్ధంగా ఆహారాన్ని తయారుచేస్తున్నట్లు వెల్లడైందని తెలిపారు. నాణ్యతలో అనేక లోపాలు గుర్తించి, తగిన ఆధారాలు కూడా సేకరించామని పేర్కొన్నారు. కొన్ని హోటల్స్‌లో హానికర రసాయనాలు కలిపి ఆహారాన్ని తయారు చేస్తున్నారని నాణ్యత లేని ఆహారాన్ని వినియోగిస్తున్న కారణంగా ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారని అన్నారు. బయట ఆహారం తీసుకునేటప్పుడు నాణ్యత పట్ల  అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

===================

అమెరికా సుంకాల పెంపు సమస్యకు మెరుగైన ప్రత్యామ్నాయాలను కనుగొని మరింత అభివృద్ధి సాధిస్తామని ఆంధ్రప్రదేశ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు పి.భాస్కర్ రావు, భారతీయ పరిశ్రమల సమాఖ్య ఆంధ్రప్రదేశ్ మాజీ అధ్యక్షులు లక్ష్మీ ప్రసాద్  పేర్కొన్నారు. ఈరోజు విజయవాడలో వారు పాత్రికేయులతో మాట్లాడారు. లక్ష్మీ ప్రసాద్  మాట్లాడుతూ.. అమెరికా సుంకాల పెంపుపై ఆందోళన చెందనవసరం లేదని, వ్యవసాయం, సాంకేతికతలో భారత్ అమెరికాకు తక్కువ కాదని అన్నారు. ఈ పరిస్థితులలో ఎగుమతులకు నూతన ప్రత్యామ్నాయాలు చూడాలని కోరారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు పి.భాస్కరరావు మాట్లాడుతూ.. ఇటీవలే బ్రిటన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై భారత్ సంతకం చేసిందని, ఇతర దేశాలతో కూడా ఇటువంటి ఒప్పందాలపై మరింత దృష్టి పెట్టాలని కోరారు. సుంకాల పెంపు సమస్య తాత్కాలికమని అన్నారు. ఫార్మాస్యూటికల్స్‌ను మినహాయించడం ఊరట కలిగించే అంశమని పేర్కొంటూ...

(వాయిస్ బైట్...33 సెకన్లు)

===================

స్వాతంత్య దినోత్సవాన్ని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా ఐక్యతా భావనను పెంపొందించేందుకు "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమాన్ని ఈ నెల 15వ తేదీ వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్నాయి. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో ప్రతీ ఒక్కరూ పాల్గొని తమ తమ ఇళ్ళపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని ప్రభుత్వం పిలుపునిచ్చింది. అదే విధంగా తిరంగా రంగోలి, తిరంగా బైక్ ర్యాలీ, తిరంగా రాఖీ తయారీ వంటి కార్యక్రమాల్లో భాగమవ్వాలని కోరింది. భారత జాతి గర్వాన్ని ప్రకాశించే జాతీయ పతాకంతో తీసుకున్న సెల్ఫీ చిత్రాల ఆనందాన్ని www.harghartiranga.com వెబ్‌సైట్‌లో పంచుకోవాలని సూచించింది.

===================

ఉత్తర కర్ణాటకలో సగటు సముద్ర మట్టానికి 5.8 కి.మీ ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతుందని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. ఆగస్టు 13 నాటికి వాయువ్య బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న పశ్చిమ-మధ్య బంగాళాఖాతంలో అల్పపీడన ప్రాంతం ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది. రాష్ట్రంలో రాగల మూడు రోజుల వరకు వాతావరణ పరిస్థితులను వాతావరణ శాఖ అధికారి తెలియజేస్తూ...

(వాయిస్ బైట్...28 సెకన్లు)

===================

===================